సాక్షి
నారాయణపేట
శనివారం ၊ 4 ၊ అక్టోబర్ ၊ 2025



వినూత్న సేవా కార్యక్రమానికి ఆర్టీసీ శ్రీకారం

- పేదలు, అనాథలు పుణ్యక్షేత్రాల దర్శనానికి అవకాశం
- దాతలు ముందుకు వస్తే బస్సుల కేటాయింపు
- విభిన్న మార్గాల్లో సంస్థకూ సమకూరనున్న ఆదాయం

ఆధ్యాత్మిక ఆనందం.. యాత్ర దానం



యాత్ర దానం పోస్టర్ విడుదల చేస్తున్న నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి తదితరులు (ఫైల్)

నారాయణపేట రూరల్: ప్రతి మనిషికి పుణ్యక్షేత్రాలు సందర్శించాలనేది ఓ కల.. వాటిని నిజం చేసుకునేందుకు ఎంతోమంది పరితపిస్తుంటారు. ముఖ్యంగా తమ ఇష్టదైవాలను దర్శించుకుని దేవుని ఆశీర్వాదం పొందాలని కోరుకుంటారు. అయితే పేదరికం ఎంతోమందికి ఈ కల నెరవేరకుండా అడ్డుపడుతుంది. ఫలితంగా జీవితకాలంలో సైతం తమ ఇష్టదైవాలను దర్శించుకోలేక ఎంతో మంది నిరుపేదలు తీవ్ర మనోవేదనకు గురవుతుంటారు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ఆర్టీసీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో యాత్ర దానం పేరిట దాతల సహకారంతో అనాథలు, పేదలు పలు ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలను సందర్శించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అదేవిధంగా ఆర్టీసీకి సైతం ఇది ఒక ఆదాయ వనరుగా మారనుంది.

పథకం అమలు ఇలా..

ఎంతోమంది తమ పుట్టినరోజు వేడుకలు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు, ఇతర శుభకార్యాలు జరుపుకొనే వారు డబ్బులను వృథా చేయకుండా పేదలకు యాత్ర దానం కల్పించి ఆధ్యాత్మిక ఆనందం పొందవచ్చు. ప్రజాప్రతినిధులు, కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలు ఇలా ఎవరైనా ఆర్టీసీకి విరాళాలు అందిస్తే అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలకు విహారయాత్రకు తీసుకువెళ్తారు.

- దాతలు ప్రత్యేకంగా ఏ పుణ్యక్షేత్రానికి, పర్యాటక ప్రాంతానికి యాత్ర దానం చేయాలనుకున్నారో ముందుగా సంబంధిత ఆర్టీసీ డిపో మేనేజర్లను సంప్రదించాలి. అధికారులు యాత్రకు సంబంధించిన దూరాన్ని లెక్కించి కిలోమీటర్ల ఆధారంగా డబ్బులు, ఇతర వివరాలు తెలియజేస్తారు.
- యాత్రకు సంబంధించిన ప్యాకేజీ డబ్బులను దాతలు ఒక్కరే భరించవచ్చు. లేదా మిత్రుల భాగస్వామ్యంతోనైనా చెల్లించవచ్చు. అందించిన డబ్బుల ఆధారంగా అధికారులు అవసరమైన బస్సు ఏర్పాటు చేస్తారు. దాత వివరాలు, ఫోన్ నంబర్ ఇవ్వాలి. టీజీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్‌లోనూ నమోదు చేయాలి. దాతలు యాత్రకు వెళ్లే వారి పేర్లను సైతం సూచించవచ్చు. లేదా ఆర్టీసీనే నిరుపేదలు, వృద్ధులు, విద్యార్థులను ఎంపిక చేసి తీసుకువెళ్తుంది.

దాతలు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు..

డిపో	డీఎం	సెల్ నంబర్
మహబూబ్‌నగర్	సుజాత	99592 26286
షాద్‌నగర్	ఉష	99592 26287
నాగర్‌కర్నూల్	యాదయ్య	99592 26288
వనపర్తి	దేవేందర్‌గౌడ్	99592 26289
గద్వాల	సునీత	99592 26290
అచ్చంపేట	ప్రసాద్	99592 26291
కల్వకుర్తి	సుహాసిని	99592 26292
నారాయణపేట	లావణ్య	99592 26293
కొల్లాపూర్	ఉమాశంకర్‌గౌడ్	90004 05878

దాతలు ముందుకు రావాలి..



తెలంగాణ ఆర్టీసీ నూతనంగా శ్రీకారం చుట్టిన యాత్ర దానం నిరుపేదలకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతుంది. సేవాభావంతో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, ఇతర వ్యక్తులు ఎవరైనా సహకరించి విరాళాలు ఇస్తే అనాథలు, వికలాంగులు, వృద్ధులు, నిరుపేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇళ్లలో జరుపుకొనే వేడుకలకు సమాంతరంగా ఇలాంటి సేవా కార్యక్రమాలకు దానం ఇవ్వడానికి ముందుకు రావాలి.

– సంతోష్‌కుమార్, ఆర్‌ఎం, మహబూబ్‌నగర్

బస్సుల స్థాయికి చార్జీలు ఇలా..

కి.మీ.,	ఎక్స్‌ప్రెస్	డీలక్స్	సూపర్ లగ్జరీ
	(రూపాయలలో..)		
201- 300	38,782	32,587	29,752
301- 400	38,782	38,782	35,002
401- 500	44,977	44,977	40,252
బస్సులో సీట్లు	50	40	34

దసరా సంబురం..!

- ఆలయాల్లో, జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు
- మక్తల్‌లో మంత్రి ఆధ్వర్యంలో అట్టహాసంగా వేడుకలు
- పేట ఆర్యసమాజ్, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు
- రాంలీల మైదానంలో సభ, రావణ దహనం



నారాయణపేటలో దుర్గామాత ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం (ఇన్‌సెట్‌లో) దుర్గామాత అమ్మవారు

నారాయణపేట/మక్తల్: జిల్లా వ్యాప్తంగా విజయదశమి వేడుకలను గురువారం ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఆయుధపూజ, జమ్మి ఇచ్చి పుచ్చుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు. ఇంటిల్లిపాది ఒక్కచోటకు చేరి పిండివంటల ఘుమఘుమలతో ప్రతి ఇంట్లో పండగ శోభకొట్టొచ్చింది. జిల్లా కేంద్రంలోని బారంబావి దగ్గర ఆర్యసమాజ్, ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్ దళ్, నగర ఉత్సవ సమితి, విశ్వ హిందూపరిషత్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. అలాగే, ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. పట్టణంలోని శ్రీరాఘవేంద్ర స్వామి, శ్రీ బాలాజీ మందిర్, అంబ భవానీ, మర్గమ్మ మందిర్, చౌడేశ్వరి, శ్రీ పాండురంగస్వామి, శక్తిపీఠం ఆలయాలతో పాటు పట్టణ శివారులోని ఎక్లాస్పూర్ బాలాజీ, లోకాయపల్లి లక్ష్మమ్మ, కర్ణాటక రాష్ట్రంలోని యానగుంది మాణిక్యగిరిలో కొలువుదీరినా వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంలో ఆర్య సమాజం మందిరంలో ఆర్య సమాజ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ సర్వోదేమంత్రి కుమారి నాగమ్మ ఆధ్వర్యంలో ముఖ్య అతిథి దేవదత్త సర్వదే పాల్గొని ధ్వజహారణ కార్యక్రమాన్ని బీకేఎస్ రాష్ట్ర జోనల్ కార్యదర్శివెంకోబచే ఓంకార ధ్వజ పతావిష్కరణ చేశారు. ఆ తర్వాత ధ్వజారోహణను బీకేఎస్ నాయకులు వెంకోభకు ఓంకారం జెండాను బీజేపీ రాష్ట్ర నేత నాగూరావు నామాజీ అందించగా.. పురవీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. జమ్మి కొమ్మలను తీసుకువచ్చి బారంబావి దగ్గర ప్రత్యేక పూజలుచేశారు. ఆ తర్వాత రావణ దహన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతం ఒకరికొకరు జమ్మిని పంచు కుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



పేటలో రావణుడి దాహనం.. వీక్షిస్తున్న జనం

షమీ వృక్షానికి ప్రత్యేక పూజలు

పట్టణం, మండలంలోని కోటకొండ, కొల్లంపల్లి, జాజాపూర్ తదితర గ్రామాల్లోని వివిధ ఆలయాల్లో కొలువైన జమ్మి వృక్షానికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. విజయదశిమిని పురస్కరించుకుని షమీ వృక్షా నికి పూజలు చేసి జమ్మి ఆకులను ఇంటికి తీసుకువెళ్లి సాయంత్రం వేళలో ఒకరికొకరు పం చుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

సకలజనులంతా సుభిక్షంగా ఉండాలి

ఏ పండుగైనా సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నంగా ఉండాలని... సకలజనులంతా సుభిక్షంగా ఉండాలని, అందరికీ అష్టైశ్వర్యాలు ప్రసాదించి ఆరోగ్యంగా ఉండేటట్లు రైతు కుటుంబాల్లో ఆర్థికంగా స్వలంబన పుష్కలమైన పంటలు పండాలన్నాని వక్తలు ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని బారంబావి దగ్గరలోని రాంలీలా మైదానం లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు వక్తలు పాల్గొని హైందవ సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు దసరా విశిష్ఠతను వివరించారు. ఓంకార నినాదాలతో శ్రీ దయానంద సరస్వతి మార్గ సూత్రాలను పాటించి యాగ యజ్ఞాలకు ప్రాధాన్యత ఇవ్వాలని వారి అడుగుజాడల్లో ముందుకు తీసుకుపోయే మార్గాలను వారు సందేశాన్నిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవడంతో ఉత్సవాలు జరుపుకొంటున్నమన్నారు. నాటి కాలంలో చత్రపతి శివాజీ కాలుమోపిన నేల నారాయణపేట అన్నారు. ఉత్సవాల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు రతంగ్‌పాండురెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రతంగ్‌పాండురెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్, గణేశ్, దసరా ఉత్సవ నాయకులు పాల్గొన్నారు.

మక్తల్‌లో అంబరాన్నంటిన సంబరాలు..



మక్తల్‌లోని ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, కుటుంబసభ్యులు



మక్తల్‌లో వివిధ వేషధారణల్లో కళాకారులు..

మక్తల్‌లో దసరా సంబరాలు అంబరాన్నంటాయి. రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యసహకార, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కుటుంబ సమేతంగా పడమటి ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయంలో, జమ్మిచెట్టు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఇదిలాఉండగా, తొమ్మిదిరోజులపాటు ప్రత్యేక పూజలు అందుకున్న అమ్మవారిని భారీ ఏర్పాట్ల నడుమ శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేకంగా మహారాష్ట్ర నుంచి వచ్చిన ప్రత్యేక బ్యాండ్ బృందం, వివిధ వేషధారణల కళాకారుల ఆకట్టుకున్నారు. పట్టణంలోని నల్లజానమ్మ ఆలయం నుంచి పాతబజారు, నేతాజీనగర్, వాకిటి వీధి మారుతినగర్, యాదవనగర్, గోపాలస్వామి గుడి మీదుగా రాంలీలా మైదానానికి శోభాయాత్ర చేరుకుంది. అక్కడే మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఆ ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం అమ్మవారిని నిమజ్జనం చేశారు. సాయంత్రం మైదానంలో రావణాసురిడి కటౌట్‌ను బాణాసంచా పేలుళ్ల నడుమ దహనం చేశారు. ఇదిలాఉండగా, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి సైతం పూజల్లో పాల్గొన్నారు.



అలంపూర్ క్షేత్రంలో జోగులాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివార్ల తెప్పోత్సవం గురువారం రాత్రి కనులపండువగా జరిగింది. అశేషంగా తరలొచ్చిన **భక్తజనం** మధ్య ఆది దంపతులు హంసవాహనంపై తుంగభద్ర నది విహారం నయనానందంగా సాగింది. - అలంపూర్

- వివరాలు 12లో..

పులకించిన కొండారెడ్డిపల్లి

- స్వగ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి దసరా వేడుకలు
- కుటుంబ సభ్యులతో కలిసి జమ్మి వేడుకలకు హాజరు
- ఘన స్వాగతం పలికిన ప్రజలు
- భారీగా తరలివచ్చిన అభిమానులు



మనవడితో కలిసి జమ్మి పూజలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వంగూరు: దసరా పండుగను పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం స్వగ్రామం కొండారెడ్డిపల్లికి రావడంతో గ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి. గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు హెలీకాప్టర్‌లో సీఎం కొండారెడ్డిపల్లికి చేరుకోగా.. ఎమ్మెల్యే వంశీకృష్ణ, రైతు కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, బాలాజీసింగ్, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు ప్రచార రథంపై వెళ్తుండగా బతుకమ్మ, కోలాటాలతో గ్రామస్తులు అభివాదం చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ముఖ్యమంత్రి ఇంటికి చేరుకున్నారు. సాయంత్రం 5.30 గంటలకు సోదరులు తిరుపతిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, కృష్ణారెడ్డి ఇతర కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి కోటమైసమ్మను దర్శించుకొని, భాజాభజంత్రీలతో భారీ ర్యాలీగా వెళ్లి జమ్మి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం రాత్రి 8 గంటలకు రోడ్డు మార్గాన కొడంగల్‌కు బయలుదేరి వెళ్లారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో..

స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందుకు కలెక్టర్ బదావత్ సంతోష్‌తోపాటు ఇతర అధికారులు ముఖ్యమంత్రి పర్యటనలో కనిపించలేదు. ఏర్పాట్లను మొత్తం గ్రామస్తులే చూసుకున్నారు. కేవలం భద్రతా ఏర్పాట్లను మాత్రమే పోలీసు అధికారులు పర్యవేక్షించారు.

జమ్మిని బంగారంగా స్వీకరించే గొప్ప సంస్కృతి



నారాయణపేట: జమ్మి ఆకును బంగారంగా స్వీకరించే గొప్ప సంస్కృతి మనదని, పాలపిట్ట, జమ్మి చెట్టును రాష్ట్ర చిహ్నాలుగా గుర్తించిన ఘనత రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్‌దేనని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ప్రజలందరికీ అన్నారు. గురువారం కోయిలకొండ మండలం శేరివెంకటాపూర్‌లో విజయదశమి పర్వదినం సందర్భంగా జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జమ్మి ఆకును బంగారంగా నియోజకవర్గ ప్రజలకు స్వీకరించి.. అందరిలో చెడు తొలిగి మంచి ఆలోచనలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో తగ్గిన నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం సముద్ర మట్టానికి పైన 1,020 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జలాశయానికి జూరాల ఎడమ కాల్వ నుంచి 730 క్యూసెక్కుల వరద చేరుతుండగా.. సమాంతర కాల్వలో నీటి సరఫరా లేదని చెప్పారు. జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 875 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 872 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 50 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని వివరించారు.

నియోజకవర్గ ఏర్పాటుకు సహకరించండి

అమరచింత: కోల్పోయిన అమరచింత నియోజకవర్గాన్ని తిరిగి సాధించుకునేందుకు తోడ్పాటునందించాని నియోజకవర్గ సాధన సమితి సభ్యులు బీజేపీ పంజాబ్, చండీఘడ్ రాష్ట్రాల సంస్థగత కార్యదర్శి మంత్రి శ్రీనివాస్‌ను కోరారు. దసరా పండుగకు స్వగ్రామం అమరచింతకు వచ్చిన మంత్రి శ్రీనివాస్‌ను గురువారం వారు కలిసి మాట్లాడారు. అమరచింత నియోజకవర్గ ఏర్పాటుకుగాను అన్ని రాజకీయ పార్టీల నేతల మద్దతుతో ముందుకెళ్తున్నామన్నారు. అదేవిధంగా జిల్లాకు మంజూరైన కేంద్రీయ విద్యాలయాన్ని అమరచింతలో ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక పంపిస్తే కేంద్ర మానవ వనరులశాఖ మంత్రిని కలిసి విద్యాలయం ఏర్పాటుకు తనవంతు ప్రయత్నం చేస్తానని కేశం నాగరాజ్‌గౌడ్‌కు సూచించారు. నియోజకవర్గ సాధనలో పట్టణ పౌరుడిగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం



గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ వినీత్

- నూతన ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట/కృష్ణా: జాతిపిత మహాత్మా గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని నూతన ఎస్పీ వినీత్ అన్నారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సత్యం, అహింస, సత్యాగ్రహం అనే మూడు ఆయుధాలతో బ్రిటీష్ వారిపై పోరాటం చేసి దేశానికి స్వతంత్రం తీసుకొచ్చిన గొప్ప యోధుడు గాంధీజీ అన్నారు. నేటి యువతరం గాంధీజీ జీవన మార్గాన్ని అనుసరించాలన్నారు. దేశంలో అన్ని కులాలు అన్ని మతాల వారు కలిసి మెలిసి ఉండాలని సంకల్పించిన గొప్ప మానవతావాది గాంధీజీ అని, అలాంటి గొప్ప నాయకుని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు సేవ చేయాలని, కష్టపడే తత్వం అలవర్చుకోవాలన్నారు. పోలీసులు ప్రజలకు మంచి సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరసింహ, ఆర్ఎస్ఐ శ్వేత, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో అక్రమ రవాణాను అరికట్టాలి

కృష్ణా: సరిహద్దులో ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టు వద్ద పటిష్ట నిఘా ఉంచాలని ఎస్పీ వినిత్ ఆదేశించారు. శుక్రవారం సరిహద్దులోని చెక్‌పోస్టుతోపాటు కృష్ణా పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమేరకు సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి రోజు వాహనాలను తనిఖీ చేయడంతో పాటూ అక్రమ రవాణా, నిషేధిత పదార్థాల సరఫరా జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మక్తల్ సీఐ రాంలాల్,ఎస్ఐ ఎండీ నవీద్,ఏఎస్ఐ సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీగా బాధ్యతల స్వీకరణ

జిల్లా నూతన ఎస్పీగా డాక్టర్ వినీత్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఇదివరకు కొత్తగూడెం ఎస్పీగా, మాదాపూర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై నారాయణపేట జిల్లా ఎస్పీగా వచ్చారు. 2017 (బ్యాచ్) సంవత్సరంలో ఎస్పీగా నియమితులయ్యారు. డీఎస్పీ నల్లపు లింగయ్య జిల్లా పోలీస్ అధికారులు ఎస్పీకి పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి



మంత్రి వాకిటి శ్రీహరితో మాట్లాడుతున్న ఉమ్మడి మాగనూర్, కృష్ణా మండలాల రైతులు

కృష్ణా: సన్న రకం ధాన్యానికి అందించే బోనస్ అంశం ఒక్క కృష్ణా, మాగనూర్ మండలంలోనే కాదు ఇది రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న సమస్య అని, ఈ విషయంపై శనివారం జరగబోయే క్యాబినెట్ సమావేశంలో సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ త్వరగా అందించాలని శుక్రవారం మంత్రిని ఆయన స్వగృహంలో రైతులు కలిసి విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు ఉమ్మడి మాగనూర్,కృష్ణా మండలాలకు చెందిన రైతులు గురువారం దసరా రోజు టైరోడ్డులో సమావేశమై.. తమ సమస్యలు పరిష్కరించకుంటే స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలని తీర్మానించారు. ఈ విషయంపై శుక్రవారం రైతులు మంత్రిని కలిశారు. ఈమేరకు మంత్రి మాట్లాడుతూ.. రైతులు ఇలా సమావేశం కావడం, సమస్యలపై ప్రశ్నించడం రైతుల్లో వచ్చిన ఈ చైతన్యం, మార్పు అభినందనీయమన్నారు. ఇక మీదట ప్రతి నెల మార్కెట్ చైర్మన్ అధ్యక్షతనలో మక్తల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ అధికారులు, మక్తల్, మాగనూర్,కృష్ణా మండలాలకు చెందిన రైతులతో ప్రత్యేక సమావేశాలను నిర్వహించబోతున్నామని అన్నారు. రైతుల సమస్యలు ఏవైన అక్కడికక్కడే పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. త్వరలోనే కృష్ణా మండలంలోని భీమా నదిపై చెక్‌డ్యాంలు నిర్మిస్తామని, అలాగే ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయిస్తానని అన్నారు. అనంతరం మంత్రికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బాలకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, రాజప్పగౌడ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొంకల్ వెంకటేష్, నాగేశ్వర్‌రావ్, చెవిటోళ్ల వెంకటేష్,మురహర్‌దొడ్డి శ్రీను,శంక్రప్ప పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరువులో మృతదేహం లభ్యం

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామ సమీపంలోని చెరువులో దసరా పండుగ రోజు ఓ మృతదేహం లభ్యమైంది. రేవల్లి ఎస్‌ఐ రజిత తెలిపిన వివరాల మేరకు.. చెరువులో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విచారణ జరపగా నాగర్‌కర్నూల్ జిల్లా గుడిపల్లికి చెందిన మధురాజు పర్వతాలు (40)గా గుర్తించారు. పర్వతాలు సెప్టెంబరు 30న ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అతడి భార్య కవిత నాగర్ కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈనెల 2న నాగపూర్ సమీపంలోని చెరువులో మృతదేహం కనిపించగా పోలీసులు.. కవితకు చూపించగా తన భర్తదేనని గుర్తించింది. భర్త మరణంపై అనుమానాలు ఉన్నాయని తెలుపగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం తాగి వృద్ధుడు మృతి

ఖిల్లాఘనపురం: మద్యంతాగి ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన ఖిల్లాఘనపురం మండలం మల్కిమియాన్‌పల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన పూల శ్రీశైలం (61) తన భార్య పూల సత్యమ్మతో కలిసి మల్కిమియాన్‌పల్లి శివారులోని బాలాజీ రైస్‌మిల్లులో కూలిపనులు చేసుకుంటు జీవిస్తున్నారు. గురువారం దసరా పండుగ సందర్భంగా గ్రామంలోకి వెళ్లి మద్యం తాగాడు. సాయంత్రం వాంతులు చేసుకుని చాతిలో నొప్పి వస్తుందని చెప్పి ఇబ్బందిపడ్డాడు. వెంటనే అతన్ని ఓ ప్రైవేటు వాహనంలో ఖిల్లాఘనపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సలహామేరకు మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌గనర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయమై శుక్రవారం మృతుడి భార్య పూల సత్యమ్మ తన భర్త మృతిపై ఎలాంటి అనుమానం లేదని మద్యం తాగడంతోనే మృతిచెందినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

నవాబుపేట: కుటుంబ తగాదాలతో భార్య విడిచిపెట్టి వెళ్లిందని మనస్తాపంలో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఊరంచుతండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన దీపక్(36) భార్య రెండేళ్ల క్రితం కుటుంబ తగాదాలతో విడిచిపెట్టి వెళ్లింది. దీంతో అప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ తీవ్ర మనోవేదనతో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయంలో అతని మామ రాములు నాయక్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

ఈతకు వెళ్లి వ్యక్తి మృతి


బోయ పూజారి హన్మంతు(ఫైల్)

మల్దకల్: పండగ పూట విషాదం నెలకొన్న ఘటన మండలంలోని దాసరిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోయ పూజారి హన్మంతు(35)కు కల్లు తాగే అలవాటు ఉంది. గురువారం పండగ సందర్భంగా కల్లుతాగి తోటిమిత్రులతో కలిసి బావిలో ఈతకు వెళ్లాడు. మత్తులో ఉన్న హన్మంతు బావిలో ఈత కొట్టే క్రమంలో అపస్మారక స్థితిలోకి వెళ్లి బావిలోనే మునిగిపోయాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలపడంతో ఘటనా స్థలానికి చేరుకుని హన్మంతు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య శంకరమ్మతోపాటు ఇద్దరు సంతానం ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పురందర్ తెలిపారు.

జూరాలకు తగ్గిన వరద


శ్రీశైలంలో పది గేట్ల ద్వారా విడుదల అవుతున్న వరద

- 2.70వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 15 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 2.73 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం రాత్రి 9 గంటలకు ప్రాజెక్టుకు 2.82 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శుక్రవారం రాత్రి 8 గంటల వరకు 2.70 లక్షలకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 15 క్రస్టు గేట్లను ఎత్తి 2.436 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 70 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 410 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 2.733 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.571 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. నారాయణపూర్ ప్రాజెక్టుకు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 33.313 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 23వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 2 గేట్లను ఎత్తి దిగువన ఉన్న జూరాలకు 17,600 క్యూసెక్కుల నీటిని దగువకు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంలో పది గేట్లు ఎత్తివేత

దోమలపెంట: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటి ప్రవాహం తగ్గినా శుక్రవారం శ్రీశైలం ఆనకట్ట వద్ద పది గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాలలో ఆనకట్ట స్పిల్‌వే ద్వారా 2.436 లక్షల క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 28,262 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 13,338 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 1,125 క్యూసెక్కులు మొత్తం 2.863 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరుతుంది. శ్రీశైలంలో ఆనకట్ట పది గేట్లు ఒకొక్కటి పది అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 2.76 లక్షల క్యూసెక్కులు, శ్రీశైలం కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 65,784 క్యూసెక్కుల నీళ్లు అదనంగా సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 884.0 అడుగుల వద్ద 210.0320 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 5 వేల, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,817 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.732 మిలియన్ యూనిట్లు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 15.003 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

745.929 ఎంయూ విద్యుదుత్పత్తి

జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రంలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 745.929 మిలియన్ యూనిట్లు చేపట్టారు.


జూరాలలో దిగువకు విడుదలవుతున్న నీరు

బాలింత మృతితో బంధువుల ఆందోళన


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

- ప్రసవం తర్వాత వేరే గ్రూప్ రక్తం ఎక్కించడంతో ఇన్‌ఫెక్షన్
- హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- ఆడబిడ్డ కోసం వెళ్తే ప్రాణం తీశారు..


అంజనమ్మ (ఫైల్)

కల్వకుర్తి టౌన్: ప్రసవం తర్వాత బాలింతకు తన గ్రూప్ రక్తం ఓ పాజిటివ్ కాకుండా ఇతర గ్రూప్ రక్తం ఎక్కించడంతో ఇన్‌ఫెక్షన్ అయి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నల్గొండ జిల్లా డిండి మండల కేంద్రానికి చెందిన ఆంజనేయులు, అంజనమ్మ (25) భార్యాభర్తలు. వీరికి గతంలోనే ఇద్దరు మగపిల్లలు పుట్టారు. కానీ ఆడబిడ్డ కోసం వేచి ఉన్న వారు మూడో కాన్పు కోసం సెప్టెంబర్ 6న పట్టణంలోని రమ్య ఆస్పత్రికి వచ్చారు. అంజనమ్మను పరీక్షించిన ఆస్పత్రి వైద్యురాలు రమ్య ఆమెకు కాన్పు చేసి, బాలింతకు రక్తం తక్కువగా ఉందని, ఎక్కించాలని సూచించారు. వెంటనే భర్త ఆంజనేయులు జిల్లా కేంద్రానికి వెళ్లి రక్తం తీసుకొని రాగా.. అదే రోజు రక్తాన్ని బాలింతకు ఎక్కించారు. అనంతరం ఆమెకు ఇన్‌ఫెక్షనై కాళ్లు, చేతులు వాయటంతో పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వారు మెరుగైన వైద్యం కోసం పేరొందిన మరో ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడే చికిత్స తీసుకుంటుండగా పరిస్థితి విషమించి శుక్రవారం బాలింత మృతి చెందింది. దీంతో బాలింత మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి పట్టణంలో కాన్పు చేసిన రమ్య ఆస్పత్రి ఎదుట ఉంచి బాధిత కుటుంసభ్యులు ఆందోళన చేపట్టారు.

రూ. లక్షలు ఖర్చు చేసినా..

బాలింతకు హైదరాబాద్ ఆస్పత్రిలో దాదాపు 26 రోజుల చికిత్స కోసం రూ.30 లక్షల వరకు ఖర్చయ్యిందని బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. రమ్య ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం ఉండటంతో ముందుగానే గమనించిన యాజమాన్యం బాధిత కుటుంబ సభ్యులను ఎప్పటికప్పుడు వాకబు చేసేవారని భర్త ఆంజనేయులు తెలిపారు. ప్రతిరోజు యాజమాన్యం తరఫున హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో ఓ సీఐ స్థాయి అధికారి పరామర్శించేవాడని, మానవతా దృక్పథంతో రూ.50 వేలు ఇస్తున్నానని డబ్బులు కూడా ఇచ్చాడని భర్త అన్నారు. పూర్తిగా తన భార్య మరణానికి ఆస్పత్రి వైద్యురాలి నిర్లక్ష్యమే కారణమని వారు వాపోయారు. న్యాయం జరిగే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పసికందును చూపిస్తూ బాధిత కుటుంబ సభ్యుల రోదనలు అక్కడి వారిని కలిచివేశాయి. ఒక్కసారిగా ఆస్పత్రి వద్ద జనం గుమిగూడటంతో కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్‌ఐ మాధవరెడ్డి అక్కడికి చేరుకొని పరిస్థితిని తెలుసుకున్నారు. పట్టణానికి చెందిన పలువురు రాజకీయ నాయకులు, పోలీసుల సమక్షంలో బాధిత కుటుంబ సభ్యులతో రాజీ కుదిర్చేలా చర్చలు జరుపుతున్నారు. పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఎలాంటి మరణాలు సంభవించినా రాజకీయ నాయకులు, పోలీసులు వెంటనే ప్రత్యక్షమవ్వటంపై పట్టణంలోని ప్రజలు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.

అంత్యక్రియలకు మాజీ మంత్రులు హాజరు


మాజీమంత్రి లక్ష్మారెడ్డిని పరామర్శిస్తున్న నాయకులు

తిమ్మాజిపేట: మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి మాతృమూర్తి చర్లకోల లక్ష్మమ్మ అంత్యక్రియలలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజలు పాల్గొని నివాళులర్పించారు. ఈనెల 1న హైదరాబాద్‌లో లక్ష్మారెడ్డి తల్లి మరణించారు. 2న విజయదశమి ఉండడంతో శుక్రవారం ఆయన స్వగ్రామం తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామంలో తన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. లక్ష్మారెడ్డితో పాటు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, పలువురు నాయకులు లక్ష్మమ్మ పాడె మోశారు. అంతకు ముందు మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మోహనాచారి ఆవంచలో లక్ష్మారెడ్డిని పరామర్శించి ఆయన తల్లి అంత్యక్రియలలో పాల్గొని నివాళులర్పించారు.

రైలు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

దేవరకద్ర: దేవరకద్ర రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాల పక్కన శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ ఘటన జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. దేవరకద్ర రైల్వే స్టేషన్ సమీపంలో ఆకుపచ్చ టీషర్టు ధరించిన 30నుంచి 35 సంవత్సరాల వ్యక్తిని రైలు ఢీ కొట్టడం లేక రైలులోంచి కింద పడడంతో తీవ్రంగా గాయపడి పట్టాల పక్కన పడి ఉన్నాడని రైల్వే ఎస్‌ఐ అక్బర్ తెలిపారు. తల, శరీర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గాయపడ్డ వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే మహబూబ్‌నగర్ రైల్వే ఎస్‌ఐని సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోపాల్‌పేట: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందగా కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నరేష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మున్ననూరుకు చెందిన కావలిగోవిందు(34) ఆర్థిక ఇబ్బందులవల్ల సెప్టెంబరు 22న తన పొలం వద్ద పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు జిల్లాఆసుత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గోవిందు గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య కావలి బేబీ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మాంసం దుకాణాల మూసివేత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈనెల 2న స్థానిక జీజీహెచ్ సమీపంలోని మాంసం దుకాణాలను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మూసివేయించారు. నిబంధనల ప్రకారం ఆ రోజు మాంసం, మందు విక్రయాలు నిషేధించిన విషయం విధితమే. కాగా, అక్కడి సుమారు 25దుకాణాలకుగాను ఆరు తెరిచి ఉంచగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య వెళ్లి వారిని హెచ్చరించి వెంటనే మూసి వేయించారు.

వామ్మో కుక్కకాట్లు..



నవాబుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నవాబుపేట: అందరు దసర సందడిలో ఉంటే కుక్కలు సైతం వీధుల్లోకి వచ్చి స్వైర విహారం చేసి జనాలపై పడ్డాయి. మండలంలో వివిధ గ్రామాల్లో కేవలం రెండు రోజుల్లోనే 18 కుక్కకాట్ల కేసులు నవాబుపేట పీహెసీలో నమోదయ్యాయి. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. పండగ కోసం గ్రామాలకు వచ్చిన వారికి కుక్కకాట్ల బయం తీవ్రంగా పెరిగింది. తాజాగా కామారం, కొల్లూర్, కాకర్లపహాడ్, ఫత్తేపూర్, మరికల్, కూచూర్, హన్మసానిపల్లి, కారుకొండలో కుక్కకాట్ల బాధితులు మండల కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స చేసుకున్నారు. ఏకంగా 18మంది 2రోజుల్లోనే ఆస్పత్రికి రావడంతో ఆస్పత్రి వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. వచ్చిన వారికి చికిత్స అందించి ఇంజక్షన్ ఇచ్చి పంపిస్తున్నారు. కాగా దీనికిగానూ యాంటీ రేబీస్ ఇంజక్షన్ అందుబాటులో ఉంచారు. కాగా ఈ విషయంలో ఆరాతీస్తే ఇప్పటికే ఈ సంవత్సరంలో 263 కుక్కకాట్ల కేసులు నమోదైనట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

మందులున్నాయి.. జాగ్రత్త అవసరం



కుక్కకాట్లకు మందులు అందుబాటులో ఉంచాం. ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలి. కుక్కకాట్లు చాలా ప్రమాదకరం. వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. ప్రధానంగా పిల్లలను కుక్కల పట్ల చాలా జాగ్రత్తగా ఉంచాలి. అది పెంపుడు కుక్క అయిన సరే. మండలంలో రెండు రోజుల్లోనే ఇన్ని కేసులు రావడ చాలా విచారకరం. గ్రామాల్లో కుక్కలను కట్టడి చేయాలి.

– శ్రావణ్‌కుమార్, మండల వైద్యాధికారి

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు


శేఖర్ (ఫైల్)

మదనాపురం: సరళసాగర్ సమీపంలోని ఊకచెట్టు వాగులో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి నీటిలో మునిగి గల్లంతైన ఘటన మండలంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొత్తకోటకు చెందిన పి.శేఖర్ (32) తన తమ్ముడు ఊషన్న, కుమారులు గణేష్, శ్రీనివాసులుతో కలిసి చేపల వేటకు ఊకచెట్టు వాగుకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ఒక్కసారిగా ప్రవాహం పెరగడంతో నీట మునిగాడు. గుర్తించిన తోటి వారు వెంటనే సహాయక చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోయింది. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా.. భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. రాత్రి పొద్దుపోయే వరకు ముమ్మరంగా గాలించినా లభ్యం కాలేదు. ప్రాజెక్టు పరిధిలో ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గుమ్మకొండ వ్యక్తి మృతి


హుస్సేన్(ఫైల్)

తిమ్మాజిపేట: మండల పరిధిలోని గుమ్మకొండకు చెందిన హుస్సేన్(40) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. పోతిరెడ్డిపల్లికి చెందిన ఎడ్ల మైబుతో కలిసి హుస్సేన్ ఈ నెల 1న రాత్రి 10.15 గంటలకు బైక్‌పై పెట్రోల్ కోసం తిమ్మాజిపేట వైపు వెళ్లారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో హుస్సేన్, మైబుకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మైబు ఎస్వీఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మృతుడి అన్న అంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేధింపులు భరించలేక ఆత్మహత్య

నర్వ: అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలకేంద్రంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మక్తల్ గ్రామానికి చెందిన కట్టగేరీ సంధ్యను ఎనిమిదేళ్ల క్రితం నర్వకు చెందిన కట్టగేరీ రాముతో వివాహమైంది. పెళ్లి తర్వాత భర్త రాము, అతడి తల్లిదండ్రులు సాయిలు, అనంతమ్మ, మరదలు అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధించేవారు. ఈక్రమంలో వేధింపులు భరించలేక సంధ్య గురువారం సాయంత్రం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి అన్న కర్రం రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పబ్బతి రమేశ్ తెలిపారు. కాగా సంధ్యకు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో డీఎస్పీకి గాయాలు

పోలీసు వాహనాన్ని ఢీకొట్టిన లారీ


డీఎస్పీ వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న ఎస్పీ జానకి, నాయకులు

జడ్చర్ల: దసరా వేడుకల్లో సీఎం బందోబస్తులో భాగంగా గురువారం ట్రాఫిక్ పరిశీలనకు మిడ్జిల్ వైపు వెళ్తున్న మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఇన్నోవా వాహనాన్ని గంగాపూర్ శివారులో వేగంగా వచ్చిన లారీ ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా ఢీకొట్టింది. ప్రమాదంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, డ్రైవర్ రంగారెడ్డి, గన్‌మెన్ శ్రీనివాసులు గాయపడ్డారు. పోలీసు వాహనం ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఎయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో పోలీసులకు తృటిలో ప్రాణాపాయం తప్పింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఏనుగొండ ఎస్వీఎస్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ లారీని విడిచి పెట్టి పరారయ్యాడు. డ్రైవర్ రంగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

ఎమ్మెల్యే , డీఎస్పీ పరామర్శ

డీఎస్పీ వెంకటేశ్వర్లు రోడ్డు ప్రమాదానికి గురయ్యారన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి వారిని ఆస్పత్రిలో పరామర్శించారు.

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎస్వీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిబ్బందిని ఎస్పీ డి.జానకి పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు.. యువకుడు మృతి


ఖిల్లాఘనపురం మండలం షాపురం స్టేజీ వద్ద చెట్టును ఢీకొన్న కారు

ఖిల్లాఘనపురం: కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందిన సంఘటన ఖిల్లాఘనపురం మండలం షాపురం గేటు సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు బిజినేపల్లి మండలం గౌరారం తండాకు చెందిన కేతావత్ సురేష్(21) గురువారం సాయంత్రం తన మిత్రుడి కారు తీసుకుని అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లిలో మరో స్నేహితుడి దగ్గరకు వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా షాపురం స్టేజి వద్ద టర్నింగ్‌లో ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టాడు. ప్రమాదంలో కారులో ఉన్న సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుక్ను ఎస్‌ఐ వెంకటేష్ ఘటన స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో కారును తీయించారు. శుక్రవారం మృతుడి భార్య అనిత(లలిత) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్కూటీని ఢీకొట్టిన బైక్.. వ్యక్తి దుర్మరణం

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారి దుర్మరణం చెందాడు. సీఐ కమలాకర్ కథనం మేరకు.. స్థానిక గౌరీశంకర్ కాలనీకి చెందిన శికారి రవికుమార్‌యాదవ్(48) దసరా పండుగ సందర్భంగా పలువురిని కలిసేందుకు ఇంటి నుంచి స్కూటీపై నేతాజీ చౌరస్తా మీదుగా రైల్వే స్టేషన్ వైపు వెళ్తుండగా నిమ్మబాయిగడ్డ వైపు నుంచి సిగ్నల్‌గడ్డ వైపు నుంచి వచ్చిన బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో స్కూటీపై ఉన్న రవికుమార్‌యాదవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే వైద్య చికిత్స నిమిత్తం ఏనుగొండ ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బైక్‌పై ఉన్న చర్లపల్లికి చెందిన శివయాదవ్, సన్ని యాదవ్‌లకు స్వల్పంగా గాయాలయ్యాయి. బైక్‌ను నిర్లక్ష్యంగా నడపడంతోనే ప్రమాదం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, తదితరులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

పండుగకు వచ్చి.. భార్యను చంపేశాడు



మక్తల్: భర్త చేతిలో భార్య దారుణ హత్యకు గురైన ఘటన శుక్రవారం మండలంలో వెలుగుచూసింది. మండలంలోని సత్యవార్ గ్రామానికి చెందిన వినోద (35) కర్నూల్‌కు చెందిన కృష్ణారెడ్డి దంపతులు. వీరు హైదరాబాద్‌లో పనులు చేస్తూ జీవించేవారు. గత కొంతకాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో తండ్రి సత్యారెడ్డి కూతురు వినోదను ఇటీవల స్వగ్రామానికి తీసుకొచ్చి ఇంట్లోనే పెట్టుకున్నారు. భర్త అప్పుడప్పుడు వచ్చి వెళ్లేవాడు. దసరా పండుగ ఉండడంతో భర్త కృష్ణారెడ్డి శుక్రవారం కూడా భార్య దగ్గరకు వచ్చాడు. ఇద్దరు పొలానికి వెళ్లి మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్న సమయంలో మార్గమధ్యలో ఒక్కసారిగా భార్యను కత్తితో పొడిచి అతి కిరాతకంగా హత్య చేశాడు. తర్వాత అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న తండ్రి సత్యారెడ్డి పొలానికి వెళ్లగా కూతురు కొన ఊపిరితో ఉండగా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే మార్గమధ్యలోనే చనిపోవడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. వినోదకు 13 ఏళ్ల కొడుకు ఉన్నాడు. హత్య ఘటనపై ఎస్‌ఐ భాగ్యలక్ష్మారెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలింత మృతి


అనూష (ఫైల్)

నారాయణపేట: జిల్లా కేంద్రానికి చెందిన అనూష (22) అనే బాలింత చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వివరాల్లోకి వెలితే... జిల్లా కేంద్రానికి చెందిన అశోక్ భార్య కాన్పు నిమిత్తం గత నెల 25న జిల్లా జనరల్ ఆస్పత్రిలో చేరింది. మగబిడ్డకు జన్మనిచ్చిన తర్వాత ఫిట్స్ రావడంతో వైద్యుల సూచన మేరకు మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి... అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో శుక్రవారం కన్నుమూసింది. మృతిరాలికి ఇది వరకు ఓ బాబు ఉన్నాడు. పురుడు పోసుకున్న వారం రోజులకే మృతి చెందడంతో పసికందును చూసి కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పళ్ల ఏరియాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అయిజలో రైతు మృతి


కుమ్మరి గోపాల్ (ఫైల్)

అయిజ: పాముకాటుకు గురై చికిత్స పొందుతూ రైతు మృతిచెందాడు. వివరాలు ఇలా.. పట్టణంలోని కుమ్మరి పేటలో నివాసం ఉంటున్న రైతు కుమ్మరి గోపాల్ (40) ఆదివారం సొంత పొలంలో పనిచేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. అదేరోజు చికిత్సకోసం గద్వాల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవల కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.